కర్నూలు | నంద్యాల
వార్త
22 ఫిబ్రవరి 2026 ఆదివారం పేజీలు 4

# వైసీపీ నేతలు వేంకటేశ్వరస్వామికి క్షమాపణలు చెప్పాలి

**: వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుద్ధి చేసిన మంత్రి టీజీ భరత్, టీడీపీ నేతలు**



**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** శాసనమండలిలో వైసీపీ నేతలు చెప్పులేసుకుని కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ఫోటోలు ప్రదర్శించడం తీవ్రంగా బాధాకరమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఈ ఘటనపై వైసీపీ నేతలు వేంకటేశ్వరస్వామికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని సంకల్ప్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి టీజీ భరత్, తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసనమండలిలో వైసీపీ నేతల ప్రవర్తన సభా గౌరవానికి విరుద్ధమని అన్నారు. ముఖ్యమైన ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో సభను అడ్డుకున్నారని విమర్శించారు. తిరుమల నెయ్యిలో కల్తీ జరిగింది వాస్తవమేనని, తప్పు జరిగిందని తెలుసుకున్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడ్డంగా వాదిస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను అంగీకరించి తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంకు వెళ్లి దేవుడిని మొక్కుకోవాలని సూచించారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్నవారు శిక్ష అనుభవించక తప్పదని, వైసీపీ నేతలకు బుద్ధి రావాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిశెట్టి శ్రీకాంత్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ కౌశిక్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయంపై..దాడి..!

- రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో.. నిరసన..
- కార్యాలయం ముందు ఫ్లెక్సీలు చించివేత
- రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు, హెచ్చరికలు



**కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పై భారతీయ జనతా పార్టీ యువమోర్చా శ్రేణులు దాడి చేశారు. కేవలం నిరసన రీతిలో కోడిగుడ్లు, టమోటాలు విసిరారు. కార్యాలయ గేటును కొద్దిగా ధ్వంసం చేశారు. అదేవిధంగా పిసిసి చీఫ్ షర్మిల ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలను కూడా చెంచివేశారు. దీంతో సుమారు రెండు గంటల పాటు హైడ్రామా నడిచింది. తాజాగా ఢిల్లీలో ఏఐ సమ్మిట్ లో చోటు చేసుకున్న బిజెపి వర్సెస్ కాంగ్రెస్ నిరసనల పరిణామాలు కర్నూలు జిల్లాల్లో ప్రభావం చూపించాయి. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ లో యూత్ కాంగ్రెస్ చేసిన నిరసన పైన బీజేపీ సహా పలు పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.**





**కర్నూలు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ లో యూత్ కాంగ్రెస్ శ్రేణులు చొక్కాలు లేకుండా సదస్సు జరుగుతున్న ప్రాంతంలో చేసిన నిరసన.. ఆ తరువాత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల వ్యవహారం కలకంగా మారింది. ఈ అంశం పైన బీజేపీ నేతలు సీరియస్ గా స్పందించారు. యూత్ కాంగ్రెస్ తీరును తప్పు బట్టారు. ఈ వ్యాఖ్యలు ఉద్రిక్తతకు దారి తీసాయి.

● వివరాలు 2లో

# ప్రభుత్వ భూమిలో.. మసీదు ( తాత్కాలిక) నిర్మాణం..!

- చట్టం విరుద్ధం అంటున్న అధికారులు.
- పవిత్రమైన రంజాన్ వరకు నవాజ్ అవకాశం ఇవ్వాలి : ముస్లిం మత పెద్దలు
- మసీదు షెడ్ తొలగించాల్సిందే.. రెవిన్యూ అధికారులు.
- ఉన్నతాధికారుల అనుమతి కోసం జేసిబీతో ఎదురు చూపులు.
- చాబోలు గ్రామం కొత్త మసీదు వద ఉద్రిక్త వాతావరణం.



**నంద్యాల ఫిబ్రవరి 21 సీటీ/ ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల మండలం చాబోలు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి ప్రక్కన సర్వే నెంబర్ 28 లో 4.18 ఎకరాల సుమారు రూ.కోట్ల విలువగల ప్రభుత్వ భూమిపై నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకవైపు ముస్లిం మైనార్టీ నాయకులు ప్రార్థనల కోసం తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేశామని, చెబుతుండగా, మరోవైపు రెవెన్యూ అధికారులు ఇది స్పష్టమైన ఆక్రమణేనని వాదిస్తున్నారు.. ఈ వ్యవహారంపై నంద్యాల రూరల్ తాసిల్దార్ శ్రీవాణి శనివారం మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 28లో మొత్తం 4 ఎకరాలు 18 సెంట్లు వాగు పోరంబోకు భూమి ఉందని, అందులో సుమారు రెండు ఎకరాల్లో అనధికారికంగా ముస్లిం మైనార్టీ నాయకులు మసీదు ఏర్పాటు చేసేందుకు షెడ్డు నిర్మించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మైనర్ ఇరిగేషన్



అధికారులకు సమాచారం అందించామని, అలాగే, అనధికారంగా షెడ్డు నిర్మించిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ శ్రీవాణి చెప్పారు. పోలీసుల సమక్షంలో షెడ్డును కూల్చివేయడం ఖాయమని రూరల్ తాసిల్దార్ హెచ్చరించారు. వాగు పోరంబోకు భూమి ప్రభుత్వ ఆస్తి అని ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని. మతపరమైన అంశంగా కాకుండా, ఇది పూర్తిగా భూసంరక్షణకు సంబంధించిన విషయం అన్నారు.

**భారీ పోలీసు బందోబస్తు :** ప్రభుత్వ స్థలంలో మసీదు నిర్మాణం వద్ద రెవిన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు నంద్యాల తాలూకా సి ఐ ఈశ్వరయ్య, టూ టౌన్ సి ఐ అస్రాఫ్ బాషాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు సంఘటన స్థలంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా భద్రత చర్యలు చేపట్టి, అప్రమత్తమయ్యారు. ముస్లిం మత పెద్దలు విలేకరులతో మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన ముస్లిం నాయకుడు మదార్ సా సర్వే నెంబర్ 29 లోని 0.05 సెంట్ల స్థలం నూతన మసీదు నిర్మాణంకు దానం చేశారని, అక్కడ నూతన మసీదు నిర్మాణం కోసం తాత్కాలిక రేకుల షెడ్ ఏర్పాటు చేసుకొని ఈ పవిత్ర రంజాన్ మాసంలో నవాజ్ చేసుకునేందుకు నిర్ణయం తీసుకున్నామని, అయితే మీరూ ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్ ప్రభుత్వ స్థలంలో ఉందని..

● వివరాలు 2లో

# నేడు బడేసాహెబ్ గంధం

**- మహిమాన్వితుడు..గంజహళ్లి బడేసాహెబ్**





**గోనెగండ్ల, ఫిబ్రవరి, 21, ప్రభాతవార్త :** కులమతాలకు అతీతంగా.. భక్తుల గుండెల్లో మహిమాన్వితుడు గా విరాజిల్లుతున్న గంజహళ్లి బడేసాహెబ్ ఎమ్మిగనూరు నియోజకవర్గం, గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీ సద్గురు మహాత్మ బడేసాహెబ్ స్వాముల దర్గా ఎంతో ప్రసింద్దిగాంచింది. ప్రతి ఏటా జరిగే స్వామి వారి ఉత్సవాలకు జిల్లాలోనే కాక ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ ఉరుసు సమయంలో గంజహళ్లి గ్రామంలో ఇసుక వేస్తే రాలదన్నట్లు భక్తులు తరలివస్తారు. శ్రీశ్రీసద్గురు మహాత్మ బడేసాహెబ్ వారి 332వ ఉరుసు మహోత్సవాలు ఈనెల 22వతేదీన ఆదివారం స్వామి వారి గంధం, 23వతేదీన సోమవారం స్వామి వారి ఉరుసు, 24వతేదీన మంగళవారం స్వామి వారి జియారత్ ఉంటుందని దర్గా పీఠాధిపతులు తెలిపారు.

**స్వామి చరిత్ర..ః** కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ తాలూకా పొదల కందకూరు గ్రామానికి చెందిన బీయమ్మ, జిందేసాహెబ్‌ల కుమారుడు శ్రీశ్రీసద్గురు మహాత్మ బడేసాహెబ్. పువ్వు పుట్టగానే పరిమిళిస్తుందని అన్న చందంగా బడేసాహెబ్ చిన్ననాటి నుండే ఆధ్యాత్మికను వంటిపట్టించుకున్నాడు. తన మహిమలు చూపుతూ గంజహళ్లి గ్రామానికి చేరుకున్నాడు. ఈ గ్రామంలో అనేక మహిమలు చూపడమేకాక ప్రజల కష్టాలు తీర్చి మహిమాన్వితుడిగా పేరుగాంచాడు. ఆ రోజుల్లో తాను ఉన్న చోటి నుంచే ప్రముఖ పుణ్యక్షేత్రాలను భక్తులకు చూపించే వారని, ఎన్నో మహిమలు చూపించి భక్తులను మైమరిపించేవారని. 1894 సంవత్సరంలో స్వామివారు జీవసమాధి అయ్యారు. నాటి నుండి స్వామి వారి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు.

**ఇక్కడ పాలు అమ్మరు....కొనరు...ః** గంజహళ్లి గ్రామంలో బడేసాహెబ్ స్వామి ఆజ్ఞ ప్రకారం పాలు అమ్మరు, కొనరు. అంతేగాకుండా గ్రామ శివారులో ఆవును వధించరు. ఆవును వధిస్తే వారికి కుష్ఠువ్యాధి రావడమేగాక, వారి కుటుంబం అంతరించిపోతుందని తరాలుగా వస్తున్న ఆచారం.

**పతి గురువారం అన్నదానం..ః** ఇక్కడకి వచ్చె వందలాది భక్తులకు ప్రతి గురువారం అన్నదానం కార్యక్రమం చేపడుతారు. అలాగే ప్రతి అమవాస్య రోజున భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు.

**ప్రత్యేక ఏర్పాట్లు...ః** ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే ఉరుసును పురస్కరించుకుని స్వామి వారి మునిమనవళ్లు దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, పీఠాధిపతి చిన్నముద్దుగోలు స్వామి, దర్గా పీఠాధిపతి షేక్ మహబుబ్‌బాషా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎప్ అధికారులు ఆధ్వర్యంలో 25 ట్యాంకర్లతో తాగునీటిని నిరంతరం సరఫరా చెయనున్నట్లు తెలిపారు. అలాగే వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తారు. ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ఆర్టీసీ డీపోల నుంచి భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతుంది. గోనెగండ్ల సీఐ చంద్రబాబు ఉరుసును పురస్కరించుకుని గట్టి బందోబస్తు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవటంతో పాలు ఉరుసుకు వచ్చే మహామహాలకు, నాయకులకు దర్గాను సందర్శించుకుని పూజలు చేసుకునేందుకు వచ్చే భక్తులకు బందోబస్తు నిర్వహిస్తారు.



# జీరోవ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలి

**: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

**కర్నూలు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ జీరోవ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో "జీరో లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్‌తో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కలెక్టరేట్ నుండి అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన వాతావరణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడంతో పాటు రీసైక్లింగ్, తిరిగి వినియోగం వంటి పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త – పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని, పర్యావరణ హిత వస్తువులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రపరచడం, డీసిల్టేషన్ పనులు చేపట్టడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సంవత్సరం సుమారు 40 నుండి 45 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిపిఓ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల తాగు నీటి కష్టాలు తీర్చాం..!

**: అస్థవ్యస్థంగా ఉన్న వాటరు ప్లాంటుకు మోక్షం రూ 8.50లక్షతోపునరుద్ధరణ**



**కోవెలకుంట్ల, పిబ్రవరి 21,ప్రభాతవార్త :** కోవెలకుంట్ల పట్టణంలో 20 ఏళ్ల నాడు నిర్మిణము చేపట్టిన మినరల్ వాటరు ప్లాంట్లు అస్థవ్యస్థంగా ఉండటముతో మంత్రి బిసి జనార్ధనరెడ్డి వాటిని మోక్షం కల్పించి ప్రజలకు శుబ్రమైన మినరల్ వాటరును అందించడానికి వాటరుప్లాంటును లాంచనంగా ప్రారంబించి ప్రజలకు అంకితము చేశారు. శనివారము ఉదయం కోవెలకుంట్ల పట్టణంలో ని సంతపేటలో రూ 8.50లక్షలతో పునరుద్ధరించిన మినరల్ వాటరు ప్లాంటును మంత్రి బిసి జనార్ధనర్ధనరెడ్డి శనివారము ఉదయం ప్రారంబించారు. అనంతకు ముందుకు మంత్రి బిసి కరిద్దెల...

● వివరాలు 2లో

# రానున్న స్థానిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యం

**: జిల్లా టిడిపి అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ**

**కర్నూలు హాస్పటల్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల/నగర/పట్టణ అధ్యక్షులు-ప్రధాన కార్యదర్శుల సమావేశంలో, జిల్లా టిడిపి అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ రాజ, కర్నూలు పార్లమెంటు అధ్యక్షురాలిగా గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ-వార్డు-బూత్ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించి మమేకం కావాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పెన్షన్ల పంపిణీ, తల్లికి వందనం, రైతు భరోసా వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే యువ నాయకులు నారా లోకేష్ ఉపాధ్యాయ, పోలీసు తదితర ఉద్యోగాల భర్తీలో తీసుకున్న చర్యలను వివరించి నిరుద్యోగ యువతకు కల్పించిన అవకాశాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో కూడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు డీసీఎంఎస్ ఛైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పి. కప్పట్రాళ్ల బొజ్జమ్మతో పాటు జిల్లా వ్యాప్తంగా మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



# నంద్యాల సబ్ రిజిస్ట్రార్ వర్సెస్ కార్యాలయ సిబ్బంది..!

**- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ, డిఐజీ రాజకీయ పెద్దల పేర్లు ప్రస్తావిస్తు సంచలన ఆరోపణలు**

**నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలకొన్న అంతర్గత విబేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఇప్పటికే రిజిస్ట్రేషన్ లావాదేవిలు, టోకెన్ వ్యవస్థ ఫీజుల నిర్వహణ సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది మధ్య ఘర్షణ కొనసాగుతుండగా తాజాగా కార్యాలయ సిబ్బంది సంచలన ఆరోపణలు బహిరంగంగా చేయడం కలకలం రేపుతోంది. కార్యాలయ సిబ్బంది ఆరోపిస్తుంది ఏమిటంటే...**

**నంద్యాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త ప్రతినిధిః** సబ్ రిజిస్ట్రార్ అధికారి స్వయంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ, డీఐజీ స్థాయి అధికారులకు మరియు రాజకీయ పెద్దలకు భారీ మొత్తం లక్షల్లో చెల్లించి ఈస్థానానికి వచ్చానని తనకు రావాల్సిన మొత్తాన్ని వసూలు చేసుకునే వరకు సిబ్బందికి ఒకరూపాయి కూడ ఇవ్వనని వ్యాక్యానించినట్లు చెబుతున్నారు. ఈవ్యాఖ్యాలు సబ్ రిజిస్ట్రార్ అధికారే స్వయంగా కార్యాలయంలోనే బహిరంగంగా చెప్పినట్టు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ఇది పరిపాలన వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అంశమని కార్యాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వ పదవుల కేటాయింపులో అవినీతి జరిగిందనే సంకేతాలు ఇస్తున్నాయని సిబ్బంది అంటున్నారు..! ఈవ్యాఖ్యాల నేపధ్యంలో కార్యాలయంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది..! మరోవైపు సబ్‌రిజిస్ట్రార్ వర్గం ఈ అరోపణలు ఖండిస్తున్నట్లు సమాచారం. క్రమశిక్షణ చర్యలను తప్పుగా అర్థం చేసుకొని కొందరు సిబ్బంది తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని వారు పేర్కొంటున్నట్లు తెలిసింది. విధుల్లో పారదర్శకత తీసుకురావడమే తమ లక్ష్యమని ప్రభుత్వ ఆదాయం కాపాడటమే ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని సమర్థించుకుంటున్నట్లు సమాచారం. ఈవ్యవహారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళిన్నట్లు సమాచారం అవసరమైతే విభాగీయ విచారణకు అదేశాలు జారీచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి. ఆరోపణలు తీవ్రత దృష్ట్యా విజిలెన్స్ లేదా ఏసీబీ విచారణకు కూడ అవకాశముందనే చర్చ సాగు తోంది. ప్రజాసేవలకు కేంద్రమైన సబ్ రిజి స్ట్రార్ కార్యాలయం అవినీతి ఆరోపణలతో వార్తల్లో నిలవడం జిల్లాలో చర్చనీయాంశం అయింది..! వాస్తవాలు వెలుగులోకి రావాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గుర్తు తెలియని వాహానం ఢీ.. వ్యక్తి మృతి

**ఆస్పరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శంకరబండ బస్టాండు దగ్గర ఆస్పరి ఆఆదోని రోడ్‌లో ఒక గుర్తు తెలియని (40) వ్యక్తిని గుర్తు తెలియని వాహానం ఢీ కొనడం మృతి చెందినట్లు ఆస్పరి సి.ఐ.గంగాధర్ తెలిపారు. శుక్రవారం రాత్రి వాహానం ఢీ కొనడంతో శరీరంపై బలమైన రక్తగాయాలు అయ్యాయని అటుగా పోతున్న కొందరు చూచి 108లో దోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో



చనిపోవడంతో మార్గమధ్యలో చనిపోవడంతో ఎమ్మిగగనూరు ప్రభుత్వ మార్చూరికి తరలించారు. మృతి చెందిన రాత్రి వరకు రోడ్డుపై తిరుగుతున్నాడని అతని ఒంటి మీదక్రీమ్ కలర్ ఫుల్‌షర్ట్, నీలం కలర్ లుంగీ ఉన్నాయని ఈ వ్యకి గురించి తెలిసిన వారు పోలీసులకు సమచరం ఇవ్వాలని తెలిపారు. విఆర్వో మాబుసుభాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కలెక్టరేట్ ఆవరణలో.. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

**- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త ప్రతినిధిః** ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల కలెక్టరేట్ అవరణలో విస్తృతస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి రాజకుమారి స్వయంగా పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలను పర్యవేక్షించారు. కలెక్టరేట్ ప్రధాన అవరణతో పాటు పీజీఆర్ఎస్ హాల్ పరిసరాల్లో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టారు. చెత్త వ్యర్థపదార్థలను తొలగించి ఒక చిన్న కాగితం కూడ కనబడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి రామునాయక్, వివిధ విభాగాల అధికారులు కలెక్టరేట్ సిబ్బంది చురుగ్గా పాల్గొని పరిశుభ్రతపై తమ నిబద్ధతను చాటారు. ప్రతిఒక్కరు సమిష్టి బాధ్యతగా భావించి శుభ్రత కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమక్షంలో సిబ్బంది అందరు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని శుభ్రతను జీవిత విధానంగా అవలంబించాల్సిన అవసరాన్ని కలెక్టర్ ఈసందర్భంగా గుర్తుచేశారు. శుభ్రత పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టరు పిలుపునిచ్చారు.



# అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలి



**డోన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** అంగన్వాడీ సమస్యలు పరిష్కారం కొరకు ఈనెల 23 నుండి 27 వరకు జరిగే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి లకు వేతనాల పెంపు గ్రాడ్యుటి పిఎఫ్ ఈఎస్ఐ అమలు తదితర సమస్యల పరిష్కారం కొరకు 23 నుండి 25 వరకు మూడు రోజులు పాటు డోర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రంలో 26 27 నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని సిఐటి పట్టణ అధ్యక్షులు మాణిక్యం శెట్టి శివరాములు ఉపాధ్యక్షులు నటి శ్రీకాంత్ పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదని విమర్శిం చారు కావున దీక్షలకు ప్రతి ఒక్కరు రావలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు అంగన్వాడీలకు హెల్త్ కార్డులు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 18 10 మినీ వర్కర్ల అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని వారిని మెయిన్ వర్కర్లుగా గుర్తించి సెంటర్లలో మార్చాలని లబ్ధిదారులకు మెనూ ఛార్జీలు పెంచి సరుకులు క్వాలిటీ మెరుగుపరచాలని డిమాండ్ చేశారు ఐదుసంవత్సరాలలోపు పిల్లలను నిర్బంధం గా అంగన్వాడి కేంద్రాలకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని బాధ్యతలు కీలకమని గర్భిణీలు, బాలిం తలు, శిశువులు,పిల్లల ఆరోగ్యాలను కాపాడటంలో వారికి సమతుల్య ఆహారము అందిం చడంలో పిల్లల మనోభావాలను మెరుగు పరచడంలో ఐసిడిఎస్ లక్ష్యాలను ముందుకు తీసుకు పోతున్నది అంగన్వాడీలు అని వారన్నారు. భారతదేశంలో ఐదు సంవత్సరాల లోపు ప్రతి వెయ్యి మంది పిల్లలలో మరణాల రేటు 100 పైగా ఉండేది అని నేడు అది 28 శాతానికి తగ్గిందని ప్రతి లక్షమంది గర్భిణీలలో మరణాల రేటు 2016 లో 130 గా ఉంటే నేడు 80 కంటే దిగువకు చేరిందని పిల్లల్లో పౌష్టికాహార లోపం ఎంత తగ్గినా ఇంకా 33 36 మధ్య ఉన్నదని అభివృద్ధి చెందిన లేదా మధ్యస్థ దేశాల స్థాయికి మనం చేరాలంటే ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఐసిడిఎస్ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని బడ్జెట్ కేటాయింపులే దీనికి నిదర్శనమని ఐసిడిఎస్ బలోపేతం కావాలంటే ముందు అంగన్వాడీలు బాగుండాలని కానీ అంగన్వాడీల జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని వెంటనే వారికి జీతాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అలా చేయకపోగా కనీసం కార్మికులుగా కూడా వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పని భారం మాత్రం ఉద్యోగులతో సమానంగా లేదా అంతకుమించి చేపిస్తున్నారని ప్రభుత్వాలు కొత్తగా ఏ స్కీమ్ తెచ్చినా ఆ పని భారాన్ని అంగన్వాడీలపై నెట్టివేయడం సరికాదని అంగన్వాడీలకు పని భారాలు తగ్గించాలని కనీస వేతనాలు అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ పిఎఫ్ ఈఎస్ఐ లు అమలు చేయాలని వేసవి సెలవులు పూర్తిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం తెలంగాణ కంటే మించి అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని 42 రోజుల పాటు సుదీర్ఘంగా సమ్మె చేసినా వేతనాలు పెంచలేదని మళ్లీ మేమే అధికారంలోకి వస్తామని అప్పుడు పెంచుతామని చెప్పారని సిఐటియు పట్టు పట్టడంతో చివరికి వాగ్దానాలు మాత్రం మినిట్స్ రూపంలో చేశారని వారన్నారు. మరోవైపు సమ్మె సందర్భంగా మద్దతు ప్రకటించిన టిడిపి జనసేన నాయకులు అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని,ఆయాలకు 20 వేల రూపాయలు చేయాలని,గ్రాట్యూటీ అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిం చాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని,పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్ల అనుభవాన్ని పరిగనలోకి తీసుకొని వారిని మెయిన్ వర్కర్లుగా గుర్తించి ఆ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీజట్టుకు ఎంపికైన ఆశోక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని




**కర్నూలు విద్య, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి రగ్బీకు జట్టుకు ఆశోక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని రామపోగు నాన్సీ ఎంపికయ్యారు. ఈనెల 21, 22 తేదీల్లో చెన్నైలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న సౌత్‌జోన్ రగ్బీ టోర్నమెంటులో ఆమె ఆంధ్రప్రదేశ్ తరుపున దిగనున్నారు. గతంలో అస్సాంలో జరిగిన సీనియర్ సౌత్ జోన్ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో నాన్సీ అద్భుత ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది. ఈపర్యటనకు ముందుగా ఫిబ్రవరి 18, 19 తేదీల్లో కర్నూలు ఆదర్శ జూనియర్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. నాన్సీ సాధించిన ఈ ఘనతపై ఆశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరుకుంటున్నామని కళాశాల ప్రతినిధులు పేర్కొన్నారు.

## విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

**- ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, పీడీఎస్‌యు, ఆర్పీఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘం**

**- కళాశాల నిర్లక్ష్యానికి బలిఅయిన విద్యార్థికి న్యాయం చేయాలి**




**కర్నూలు విద్య, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాయలసీమ యూనివర్సిటి పరిధిలోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఉశేన్ పీరా అనే విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు, ఆర్పీఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళాశాల ముందు ఆందోళన చెపట్టారు. ఈసందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్ నాగార్జున, పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ కుమార్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఆశోక్ అధ్యక్షుడు అభి, ఆర్పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయి మాట్లాడుతూ విద్యార్థి వుశేన్ పీరా మృతి అత్యంత అనుమానస్పందంగా ఉందని ఈఘటనపై కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని విద్యార్థి మృతికి దారితీసిన పరిస్థితులు కళాశాలలో ఉన్న ఒత్తిడిలు వేదింపులు పరిపాలన లోపాలు ఉన్నాయా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయం అందించి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశోక్, ఆమర్, వేణు, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంపై..దాడి..!

**(మొదటి పేజీ తరువాయి ) :** దీంతో బీజేపీ యువమోర్చా శ్రేణులు కాంగ్రెస్ పార్టీ కార్యాల యాలపై దాడులకు దిగాయి. కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోడిగుడ్లు, టమోటాలతో కాంగ్రెస్ పార్టీ ఆఫీసుపై రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, అనుచరులు దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసు గేటు ధ్వంసం చేసి ఫ్లెక్సీలను చింపేశారు. దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ సంద ర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి తీవ్ర స్థాయిలో దుయపట్టారు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే క్రమంలో తమ పార్టీ ఉండగా దాన్ని అడ్డుకునే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. ఇది చాలా దుర్మార్గపు చర్య అన్నారు. దేశ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే క్రమంలో ఢిల్లీలో ఏఐ సమ్మిట్ లో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలియజేయడం ఏమాత్రం సహించరానిది అన్నారు. ఇది ప్రపంచ దేశాల ముందు భారత్ పరువు తీయడమేనని ఆయన పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే తమ సహించమని దాడులు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు క్రాంతి నాయుడు మాట్లాడుతూ ఈ దాడి పూర్తిగా నీతిమాలిన చర్య అన్నారు. తమ కార్యాలయం పై దాడి చేయడమే కాక తమ నేత రాహుల్ గాంధీని పరుష పదజాలంతో విమర్శించడం కేవలం బిజెపి గుండెలకే చెల్లిందన్నారు. ఇప్పటివరకు ఒక పార్టీ కార్యాలయం పై మరో పార్టీ దాడి చేసుకున్న దాఖలాలు కర్నూలు జిల్లా చరిత్రలో లేవన్నారు. అలాంటిది నీతిమాలిన రాజకీయాలు చేస్తూ తనపై దాడి చేశారన్నారు. ఇప్పటికైనా వారు బుద్ధి తెచ్చుకొని సరైన రాజకీయాలు చేయాలని దేశ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. ఈ దాడుల పైన పీసీసీ చీఫ్ షర్మిల స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బీజేపీ యువమోర్చా దాడిని ఏఐసిసి సభ్యుడు లక్ష్మీ నరసింహ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపట్టాలని, కార్యాలయాలపై దాడులు సరికావని ఆయన అన్నారు. తన ఫోటోను ఉపయోగించి రాహుల్ గాంధీ ధర్నాతో సంబంధం ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజాకోర్టులో బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నానని షర్మిల పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూమిలో.. మసీదు ( తాత్కాలిక) నిర్మాణం..!

**(మొదటి పేజీ తరువాయి ) :** రెవిన్యూ అధికారులు చెప్పి సర్వే చేయడంతో మా తాత్కాలిక మసీదు ప్రభుత్వ భూమిలో ఉందని.. అయితే ఈ రంజాన్ మాసంలో ఇక్కడ నవాజ్ చేసుకొని రంజాన్ మరుసటి రోజే తామే రేకుల షెడ్ తొలగిస్తామని పోలీసు, రెవిన్యూ అధికారులను కోరారు. చట్టవిరుద్ధంగా ప్రభుత్వ భూమిలో మసీదు ఏర్పాటు సరికాదని ఈ రోజే వెంటనే ఖాళీ చేయాలని రూరల్ తహసీల్దార్ శ్రీవాణి స్పష్టం చేయగా, ముస్లిం మత పెద్దలు . చాబోలుగ్రామంలో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించి ఇక్కడికి రావాలని, అంతవరకు మా ఈ కొత్త మసీదులోనే నవాజ్ చేసుకుంటామని వాదనకు దిగారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. వందల మంది ముస్లింలు సంఘటన స్థలం వద్దకు చేరుకొని కొత్త మసీదులో నవాజ్ చేశారు. సున్నితమైన సంఘటన కావడంతో సమస్యను ప్రభుత్వ పెద్దలకు తహసీల్దార్ శ్రీవాణి వివరించి ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

## ప్రజల తాగు నీటి కష్టాలు తీర్చాం..!

**(మొదటి పేజీ తరువాయి ) :** మురళీ, శ్రీదరరెడ్డి, పెను గొండరాజశేఖరు, గుండయ్య, సారథ్యంలో బారీ స్వాగతము పలికారు. అనంతరము ఆయన రూ 8.50లక్షకుతో నిర్మాణము చేపట్టిన మినరల్ ప్లాంటును ప్రారంబించారు. అటు తర్వాత అక్కడే ఉన్న అంగన్‌వాడీ భవనమునూతనంగానిర్మాణము చేపట్టాని ప్రజల కోరిన మేరకు స్థలము చూడాలిని తహశీలుదారు పవన్‌కుమారరెడ్డికి అదేశాలు జారీ చేశారు,. అనంతరము స్వచ్ఛఅంద్రా, స్వర్ణాంద్రా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరము స్థానిక ప్రభుత్వం అసుపత్రికి చేరుకున్నారు అక్కడ డాక్టరు చంద్రశేఖరరెడ్డి సారథ్యంలో ఘన స్వాగతము పలికారు. అసుపత్రిని తనికీలో బాగంగా ఓపి వద్ద రోగులతో మంత్రి మాట్లాడారు. అలాగే ఓపి రిజష్టరును చెక్ చేశారు రోజు ఎంత మంది రోగులు వస్తున్నారని వాకబు చేశారు. అయితే డాక్టరు చంద్రశేఖరరెడ్డి వచ్చిన పిదప కోవెలకుంట్లలో ప్రవేటు అసుపత్రులు దోమలు జోలుపుకుంటున్నారని మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గడ్డంనాగేశ్వరరెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు.అనంతరము అసుపత్రిలో నూతనంగా మంజూరు అయిన అపరేషన్ యంత్రాన్ని మంత్రి ప్రారంబించారు. అనంతరము అసుపత్రి అడ్వవైజర్ కమిటి సమావేషము నిర్వహించారు. అక్కడ అసుపత్రిలో నెలకొన్న సమస్యలను మంత్రి మాలకు వేశారు.సిబ్బంది కొరత, అలాగే ఒక డాక్టరు కిందస్థాయి ఉద్యోగిని చెయ్యి చేసుకున్న విషాయాన్ని మంత్రిదృష్టికి తెచ్చారు.అలాగే పోస్టు మార్టమ్ గది, ఎక్స్ రే యంత్రాలు, తాగు నీటి సమస్యను మంత్రి దృష్టికితీసుకు రావడము జరిగింది. అనంతరము మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ అసుపత్రి నెలకొన్న సమస్యలన్నింటికి ప్రభుత్వంతో చర్చించి పరిస్కార మార్గం చూపిస్తానని అలాగే తన సొంత నిదులు వెచ్చించి అసుపత్రిలో మినరల్ వాటరు ప్లాంటును నిర్మాణము చేస్తానని చెప్పారు. ప్రజలందరికి మంచి అరోగ్యము అందించడమే మా ప్రభుత్వం లక్ష్యమన్నారు,ఈకార్యక్రమంలో ఈఓ ప్రకాశ్‌నాయడు, తహశీలుదారు పవన్‌కుమారరెడ్డి సిఐ హనుమంతునాయక్, యస్ఐలు మల్లికార్జునరెడ్డి రమణయ్య, అసుపత్రి అబివృద్ధి కమిటి సభ్యులు యస్ఎగవ్పూరు, డాక్టరు శ్రీదరరెడ్డి, గడ్డంనాగేశ్వరరెడ్వి గడ్డంఅమరనాదరెడ్డి పెనుగొండ రాజశేఖరు, కరిమద్దెల మరళీ, డాక్టర్లు, అర్‌డబ్యుయస్ డిఈఈ మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## అహోబిలంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అహోబిలం గ్రామ పంచాయితీలోని స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి హరిగోపాల్, డిఎల్డీవో శివారెడ్డి మాట్లాడుతూ ఈనెలకు సంబంధించి జీరో లిట్టర్ గవర్నెస్ గురించి తెలిపారు. అనంతరం సీఏపీటీమ్‌తో పీ-4పై రివ్యూ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నూర్జహాన్ పిఎస్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధి హామి ఈపీవో ప్రతాప్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు తీర్చిండి

**- ఏఐటీయుసి**



**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ప్రజల ఆరోగ్య పరిక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటియుసి మండల అధ్యక్షులు మహేష్ గట్టిగా డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల రాత్రిపగలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తు గర్భిణిలు, చిన్నారులు మరియు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తున్నప్పటికి వారికి తగిన గౌరవ వేతనం, ఉద్యోగ భద్రత ప్రోత్సాహక భత్యాలు అందకపోవడం దురదృష్టకరమని ఆయన అవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ఇన్‌సెంటివ్ బకాయిలు వెంటనే చెల్లించడంతో కనీస వేతనాలు అమలుచేయాలని ప్రభుత్వం ఉద్యోగ హోదా కల్పించాలని సామాజిక భద్రత పథకాలు అమలుచేయాలని ఆయన స్పష్టం చేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందించిన ఆశా వర్కర్లను ప్రభుత్వం గౌరవించాలని పేర్కొన్నారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పట్టించుకోకపోతే అందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వచ్చే 26న జరిగే మండల ద్వితీయ మహాసభకు ఆశావర్కర్లు, కర్షకులు అసంఘటిత కార్మికులు, కార్మికసంఘాలకు చెందినటువంటి కార్మికులందరు మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## శనివారానికి బదులు ఆదివారం కట్

**రుద్రవరం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రతినెల మూడవ శనివారం విద్యుత్ మెయింటెన్స్ కింద విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనేది అటు రైతులకు ఇటు గ్రామ వినియోగదారులకు తెలిసిందే ఎలాగు మూడవ శనివారం విద్యుత్ సరఫరా ఉండదు కాబట్టి శుక్రవారం రైతులు వారి పనులను ముందస్తుగా చేసుకుంటారు. అలాగే ఒక రోజు ముందుగానే గ్రామ విత్యుత్ వినియోగదారులు వారి పనులు ముందే ముగించుకుంటున్నారు. ఇటీవల గత కొన్నినెలలుగా మూడవ శనివారం బదులుగా ఆదివారం విద్యుత్ సంబంధిత విద్యుత్ అధికారులు నిలిపివేయడంతో అటు వ్యవసాయ రైతులతో పాటు గ్రామప్రజలు అందోళన చెందుతున్నామంటూ గ్రామస్తులు అరోపిస్తున్నారు. ఏవరి కోసం శనివారంకు బదులుగా ఆదివారం పూట విద్యుత్ అంతరాయం చేస్తున్నారో దిక్కుతోచడం లేదంటూ ప్రజలు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెల మూడవ శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు అలవాటుపడిన తరుణంలో ఇలా బదులుగా మరో రోజు విద్యుత్ అంతరాయం చేయడం దిక్కుతోచడం లేదంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## అంగన్‌వాడీ దీక్షలకు సిద్ధం కావాలి - ఏపి అంగన్‌వాడీ అసోసియేషన్



**వెల్దుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 23 నుంచి 27వరకు తహశీల్దార్ కారా ్యలయాల ఎదుట రిలేనిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు ఏపి అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.లలిత అన్నారు.ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు చాందినీ,మండల నాయకులతో కలిసి శనివారం ఆమె ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ పద్మావతికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.లలిత మాట్లాడుతూ గతంలో నేటి పాలకులు ఇచ్చిన హామీలను నెరవేరాచ్చలనే డిమాండ్లతో ఏఐటియుసి,అంగన్‌వాడీల రాష్ట్ర సమితి పిలుపుమేరకు చేపడుతున్న ఈ దీక్షలకు అంగన్‌వాడీలంతా సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల నాయకులు మాధవస్వామి, అంగన్‌వాడీల సంఘం నాయకులు ఈదమ్మ, విజయకుమారి, హెబ్సీబా, సుమలత, సరస్వతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాతృ భాష అమృత భాష కావాలి



**కర్నూలు విద్య, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** క్లస్టర్ యూనివర్శిటి సిల్వర్ జూబ్లి ప్రభుత్వ కళాశాల నందు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవిమర్శకులు డా.కె నాగేశ్వరచారి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి అనేక భాషలు ప్రపంచీకరణ నేపధ్యంలో కనమరుగవుతున్నాయని మాతృభాష పరిరక్షించుకోవాలన్న అవశ్యకత ఎంతో ఉందని మాతృ భాష, అమృత భాషాగా మారితే ఆ సమాజం తన ఉనికిని కోల్పోతుంది కాబట్టి మాతృభాషలు అమృతభాషలుగా మారాలని వారు తెలియజేశారు. ఈకార్యక్రమానికి వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బిఆర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ భాష అంటే కేవలం సంబాషించుకోవడానికి ఉపయోపడే మాటలు కావని, భాష అంటే ఒక సంస్కృతి, సాంప్రదాయ ఆచార వ్యవహారాలని వీటిని భావితరాలకు అందించేటటువంటి ఒక జీవధార భాషా అవుతుంది. వారి వారి మాతృభాషాలను పరిరక్షించుకోవాల్సినటువంటి అవశ్యకత ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో తెలుగువిభాగం అధ్యక్షులు డా.బి మల్లయ్య మాట్లాడుతూ చరిత్రలో భాషా పరిరక్షణ కొరకు ఉద్యోగం చేసినటువంటి ఘనత విద్యార్థులకు దక్కుతుందని ఆ విద్యార్థులు బంగ్లాదేశ్‌లోని ఢాక విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు అన్ని మాతృభాష కొరకు మాతృభాషల విద్యాబ్యాసం కొరకు ప్రాణాలు అర్పించాలని కాబట్టి మాతృభాష అంటే వారి యొక్క జాతి ఉనికి జాతి యొక్క నాగరికత అని తెలియజేస్తు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ నేపద్యాన్ని తెలియజేశారు. ఈకార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు డా.ఫమిదా బేగం, డా,భాను, డా. ఎం పార్వతీ,. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డా.రాజశేఖర్ మరియు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో స్వచ్ఛ విప్లవానికి శ్రీకారం..

**- టీడీపీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా మరో అడుగు**

**- టీడీపీ ఇన్‌చార్జి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్‌రెడ్డి, ఎన్.రాజారెడ్డిలు**

**మంత్రాలయం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు వారి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్‌రెడ్డి, ఎన్.రాజారెడ్డిలు శనివారం మంత్రాలయం పట్టణంలో స్వచ్ఛ రథ వాహనాన్ని అధికారుల సమక్షంలో ప్రారంభించారు. మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రతి మండలానికి ఒక ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి, ప్రతి గ్రామంలో ఉన్న ప్లాస్టిక్, స్టీల్, స్క్రాప్ వంటి వ్యర్థాలను సేకరించి కొనుగోలు చేసే ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారనుంది. శుభ్రమైన మండలం-అభివృద్ధి చెందిన మంత్రాలయం అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ గ్రామాల పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాల్లో ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రాలయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, అభివృద్ధి అంటే మాటల్లో కాదు, పనుల్లో చూపిస్తున్న నాయకత్వం ఇదే అని ప్రజలు అభిప్రాయ పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, తహసీల్దార్ రమాదేవి, సీడీపీఓ రాజేశ్వరి, పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉపేంద్రరెడ్డి, ఏపీఓ భక్తవత్సల్యం, మాజీ జెడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, టౌన్ అధ్యక్షులు వరదరాజులు, అశోక్‌రెడ్డి, డీసీసీ తిమ్మప్ప, ఎంపీటీసీ వెంకటేష్, కురువ సిద్ధు, శివ, రాజన్న, మేకల నరసింహా, రఘు, డీఎం నరసింహా, రఘు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెదేపా ప్రభుత్వం రైతుల ప్రభుత్వం

**-మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్.. - చెరువుమట్టి త్రవ్వకాలకు భూమి పూజ.. .**

**- సారవంతమైన మట్టితో రైతులకు మేలు..**



**వెల్దుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తెదేపా ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్ అన్నారు. బ్రహ్మగుండం సమీపంలోని ఎర్రచెరువులో మట్టి త్రవ్వకాలకు శనివారం బలరాంగౌడ్ తెదేపా నాయకులతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా బలరాంగౌడ్ మాట్లాడుతూ రైతులకు మేలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చెరువు మట్టిని పొలాలకు వేసుకునేందుకు జిఓ విడుదల చేసి అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ మట్టిని రైతులు తమ పొలాలకు ఉచితంగా తీసుకెళ్ల వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రామక్రిష్ణఆచారి, చిన్నగోపాల్‌గౌడ్, బాబురావు, రాంబాబు పాల్గొన్నారు.

## ప్రైవేట్ దుకాణాల్లో యూరియా ధర రూ.600లు

**- యూరియా కోసం రైతుల పడిగాపులు - చోద్యం చుస్తున్న వ్యవసాయ అధికారులు**

**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** బండిఆత్మకూరు మండలంలో దాదాపు 20 వేల హెక్టార్‌లలో వరిసాగుచేస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఇప్పటికే దాదాపు ఎరువులు వేయడం పూర్తి అయ్యాయి. మండల పరిధిలోని జి లింగాపురం,జీసీ పాలెం, సంతజూటూరు, నారాయణాపురం,చిన్నదేవులాపురం,పరమటూరు, బోధనం తదితర గ్రామాల్లో యూరియా ఎరువులు చాల అవసరం ఉంది అయితే సంబంధిత వ్యవసాయ అధికారులు గత పదిరోజులుగా మండలంలోని ఏ రైతు భరోసాకేంద్రానికి కూడ యూరియా తెప్పించిన వైనం లేదు. శనివారం సంతజూటూరు రైతు భరోసా కేంద్రానికి మాత్రం కొంత యూరియాను కేటాయించారు. అదికూడ పలుకుబడి ఉన్నవారికి మాత్రమే యూరియా పంపిణి చేశారు. పేద, మధ్యతరగతి రైతులకు మాత్రం మొండిచేయ్యి చూపారు. అయితే దీన్ని అసరగా చేసుకొని మండలంలో దాదాపు 20 నుంచి 30 రసాయనిక ఎరువుల దుకాణాలున్నాయి. వాటిలో మాత్రం యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ప్రైవేట్ దుకాణాల్లో రూ.500 నుంచి రూ.600ల వరకు ఎలాంటి బిల్లులు లేకుండా యూరియా అమ్మకాలు జరుగుతున్నాయి, ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు మండల వ్యవసాయశాఖ తొత్తుగా మారి వారు అధిక ధరలకు అమ్ముతున్నా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో యూరియా అమ్మకాలపై దృష్టిసారించాల్సినవ్యవసాయ అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవసరమున్న గ్రామాలకు యూరియా అందజేసి అన్నదాతలను ఆదుకోవాలని అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలపై చర్చించాలి

**- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి**




**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అసెంబ్లీ సమావేశాలు వారం రోజుల నుండి జరుగుతున్నాయి. ఈసమావేశాల్లో కర్నూలు నంద్యాల జిల్లాల్లోని ఎమ్మెల్యేలు రైతు సమస్యలపై చర్చించేవారు లేరని ఇకనైనా రైతు సమస్యలపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి అవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అసెంబ్లీలో తన తీరు మార్చుకోవాలని ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించి చట్టసభకు పంపిస్తే నియోజకవర్గంలోని రైతు సమస్యలను పక్కన పెట్టి వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత ఇవ్వడం శోచనీయం అన్నారు. జమ్ములమడుగు ఎమ్మెల్సీ అసెంబ్లీలో మాట్లాడి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని అవిధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మొక్కజొన్న, శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయించేవిధంగా చర్చించాలన్నారు. అసెంబ్లీ వేదికగా రైతుల కష్టాలు వినిపించాల్సిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అక్కడ రాజకీయంగా గత ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం వల్ల ప్రజలకు వచ్చేప్రయోజనం లేదని ఇకనైనా ఎమ్మెల్యే తన పద్ధతి మార్చుకొని రైతుల పక్షాన మాట్లాడి రైతు సమస్యలపరిష్కారానికి కృషిచేయాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్దిచెబుతారని ఆయన తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగస్వాములు కావాలి- తహశీల్దార్



**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 21 , ప్రభాతవార్త :** మండలంలో నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి శనివారం తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ నాగన్న, విఆర్ఓలు, విఆర్ఏలు, సిబ్బంది తహశీల్దార్ కార్యాలయ పరిసరాల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లో ఉన్న చెత్త ,ప్లాస్టిక్‌ను ఏరివేసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి మాసంలో వనరు- మూల వనరు అంశంతో స్వచ్ఛ కార్యక్రమాలను పాటిస్తున్నామన్నారు. అనంతరం పాల్గొన్న వారిందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

# ఆధ్యాత్మిక భక్తి భావంతో గోపుర కలశం ప్రతిష్టాపన..

**: వందగల్లులో రూ.1.50కోట్లతో నూతన దేవాలయం పునఃప్రారంభం.. : పూజలకు ముఖ్య అతిథిగా హాజరైన మురళీమోహన్‌రెడ్డి..**



**వందగల్లు(కోసిగి), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ఆధ్యాత్మిక భక్తి భావంతో నూతనంగా నిర్మించిన దేవాలయాని గోపుర కలశం ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు..గ్రామంలోని కొండపై ఉన్న ఆంజినేయస్వామి, ఈశ్వర స్వామి రెండు విగ్రహాలను ఒకేదేవాలయంలో ప్రతిష్టించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకుంది..ప్రతి ఇంట్లో ఈ వేడుకలను చేసుకుని పూజలను నిర్వహించారు.. గ్రామ పెద్ద అయిన కాల్వ లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్టాపనకు వైకాపా జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజాలో పాల్గొనా న్నరు..కాగా ఈ దేవాలయాన్ని కోటి, యాభై లక్షలతో పున: నిర్మించి నట్లు గ్రామ పెద్దలు తెలిపారు..కాగా ఈ పూజలకు సంబందించి సత్యన్నస్వామి, గోపాల్ స్వామిలు పూజలను నిర్వహించారు.. అంతకు ముందు అర్లబండ మఠం పీఠాధిపతి మఠిస్వామి తాతా ప్రత్యేకంగా పాల్గొని పూజలను నిర్వహించారు.. వేద పండితులైన రఘునందన స్వామి వేద మంత్రాలు పఠిస్తుండగా బసవరాజు తాతా నేతృత్వంలో విగ్రహ ప్రతిష్టాపన, గోపుర కలశం ప్రతిష్టాపన నిర్వహించారు.. ఈ సందర్భంగా గ్రామంలో అందరు పండుగ చేసుకోవడంతో పండుగ వాతావరణం నెలకుంది.. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొరువాంజినమ్మ, ఎంపిపి లవకుశ ఈరన్న, అంజినయ్య, గోవిందరాజులు, వైకాపా మండల అధ్యక్షులు బెట్టన్నగౌడ్, దొడ్డి నరసన్న, కామన్‌దొడ్డి నరసింహులు, కాంట్రాక్టర్ బసిరెడ్డి, గ్రామ నాయకులు, పాల్గొన్నారు..



## చెవిని అతికించిన శాంతిరాం ఆసుపత్రి వైద్యులు



**నంద్యాల హాస్పటల్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ఆధునిక వైద్య సాంకేతికత, వైద్యుల ఆసాధారణ నైపుణ్యం కలిస్తే ప్రాణాపాయం నుండే కాకుండా కోల్పోయిన శరీర భాగాలను కూడ తిరిగి పొంద వచ్చని నంద్యాల లోని శాంతిరాం అసుపత్రి వైద్యులు నిరూపించారు. పొలం పనిలో ఓ మహిళా ప్రమాద వశాత్తు పడడంతో చెవి తెగిపోయింది. తెగిన చెవిని అత్యంత క్లిష్టతరమైన ప్లాస్టిక్ సర్జరీ ద్వారా విజయవంతంగా అతికించారు. నంద్యాల జిల్లాకు చెందిన కృష్ణవేణి అనే మహిళా రైతు తన పొలంలో వరి కోత మిషన్ వద్ద పనులు చేస్తుండగా ఊహించని విధంగా ప్రమాదం జరిగి ఆమె ఎడమ చెవి పూర్తిగా తెగి శరీరం నుండి వేరుపడింది. దీనిని గమనించిన తోటి కూలీలు వెంటనే అప్రమత్తమై తెగిపోయిన చెవి భాగాన్ని భద్రపరిచి బాధితురాలిని వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ముఖ ప్లాస్టిక్ సర్జరీ డాక్టర్ శ్రీహర్ష బాధితురాలుని పరీక్షించి తెగిపోయిన చెవి భాగాన్నిన మైక్రో.వాస్క్యూలర్ రెప్లంటేషన్ అనేది వైద్య శాస్త్రంలో ఒక సవాలుతో కూడుకున్న పని అయినప్పటికి డాక్టర్ శ్రీహర్ష బృందం గంటల తరబడి శ్రమించి తెగిన చెవి భాగంలోని ఎముకను వాడి చెవిని అమర్చారు. ప్రమాదం జరిగిన వెంటనే తెగిన భాగాన్ని సురక్షితంగా తీసుకురవడం వలన సకాలంలో సర్జరీ సాధ్యమైందని డాక్టర్ తెలిపారు. ప్రమాదాలు జరిగి నప్పుడు తెగిన భాగాలను ఆంధోళప చెందకుండా ఆభాగాన్ని తడిలేని క్లీన్ ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి దానిని ఐస్ ముక్కలు ఉన్న మరో కవరులో ఉంచి వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకురావాలని వైద్యులు తెలిపారు. భాధితురాలి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మాతృభాషా దినోత్సవ వేడుకలు



**పత్తికొండ,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** పట్టణంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కాటం శ్రీదేవి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు,. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతు మనకు చిన్నప్పుడు తల్లి తండ్రి నేర్పించిన భాషనే మాతృభాష, మనకు మాతృభాషను మనం అమ్మఒడిలో ఉన్నప్పుడు ఊయలలో జోల పాడుతూ నిద్రపుచ్చేటప్పుడు గోరు ముద్దలు తినిపించేటప్పుడు మనకు అమ్మ నేర్పే భాష మాతృ భాషా అని ఆమె తెలిపారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతు ప్రపంచవ్యాప్తంగా 195 దేశాలలో దాదాపు 7147 మాతృభాషలు ఉన్నాయని, మనదేశంలో దాదాపుగా 270 భాషలు ఉన్నాయన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆయకట్టుకున్నాయి. ో తెలుగుభాష ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభష దినోత్సవం



**నందికొట్కూరు,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్.ఎం. పెర్సీ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు మద్దిలేటి, యస్.జి.టి.హాసీనాబీ మాట్లాడుతు తెలుగుభాషా(మాతృభాష) యొక్క విశిష్టతను వివరించారు. పుట్టినప్పుటి తల్లి మాతృభాషను నేర్పుతుందని, ఎన్ని భాషలు నేర్చిన అమ్మభాష అయిన మాతృభాష తెలుగును మరువకూడదని వారు వివరించారు. అంతకు ముందు మూడవ తరగతి లక్ష్మీచేతన అనే విద్యార్థిని తెలుగుతల్లి వేషధారణలో తెలుగుతనం ఉట్టిపడేలా పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఫిడే రేటింగ్ రాఫిడ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం



**నంద్యాల హాస్పటల్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ నంద్యాల రామకృష్ణ పీజి కళాశాలలో ప్రాంగణం లో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌ను రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్.రామకృష్ణారెడ్డి లాంచనంగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. డైరెక్టర్ హేమంత్‌రెడ్డి చెస్ బోర్డుపై పావులు కదిలించి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది పైగా క్రీడాకారులు హాజరు కానున్నారు. విజేతలకు ఆదివారం రూ.3 లక్షలు నగదు బహుమతులు, ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్.రామకృష్ణారెడ్డి మాట్లాడుతు చదరంగం మెదడుకు పదును పెట్టే క్రీడ అని, నంద్యాలలో అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్ నిర్వహించడం ప్రశంసనీయమని, చెస్ అభివృద్ధికి కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని, విద్యార్థులను చదువుతో పాటు క్రీడలలో ప్రోత్సాహించాలని, విద్యా సంస్థల యాజమాన్యాలకు పిలుపు నిచ్చారు. చదరంగం క్రీడ క్రీడాకారులలో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తోందని, గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం అలవడుతుందని తద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని డాక్టర్. రవికృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, చీఫ్ అర్బిటర్ ఫణికుమార్, డిప్యూటి చీఫ్ అర్బిటర్ మణికంత, నంద్యాల జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి,టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత, కోచ్ లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే నూతన మండల కమిటీ ఎన్నిక



**మద్దికెర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** రాష్ట్రంలో జర్నలిస్టు సమస్యల కోసం గళం ఎత్తి పోరాడే సత్తా గల యూనియన్ ఏపీయూడబ్ల్యూజే మద్దికెర మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా సభ్యులు తీర్మానించారు. శుక్రవారం మండల సమావేశ భవనంలో జరిగిన సమావేశానికి మండల గౌరవ సలహాదారుడు వెంకటేష్ అధ్యక్షత వహించగా మ్యు అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షులు ఎం.రంగన్న, పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎం.సాల్ రంగడు హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్‌కు అనుబంధంగా ఏపీయూడబ్ల్యూజే పనిచేస్తూ జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా వారి పక్షాన నిలబడి పోరాటం చేసే ఏకైక యూనియన్ ఏపీయూడబ్ల్యూజేనని దేశంలో మహా సముద్రం లాంటి యూనియన్ అని గుర్తు చేశారు. యూనియన్‌లో పనిచేసే ప్రతిఒక్కరూ నియమ, నిబద్ధత విలువలతో కూడిన వాన్నారు. అనంతరం మద్దికెర మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవాధ్యక్షులుగా శేఖర్, గౌరవ సలహాదారుడిగా వెంకటేష్, మండలాధ్యక్షులుగా సుల్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శిగా చంద్ర, కోశాధికారిగా రాము, ఉపాధ్యక్షులుగా విజయకుమార్, పారా రాఘవేంద్రలతో పాటు సహాయ కార్యదర్శులుగా శివశరణ, లక్ష్మన్న, ఖాదర్‌బాషా, వీరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి పదవి కట్టిపెట్టినందుకు యూనియన్‌లో ఉన్న జర్నలిస్టుల కోసం నిరంతరం కష్టపడి పని చేస్తామన్నారు. నియోజకవర్గ కమిటీకి మండల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**హాలహర్వి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామంలో శ్రీ సిద్ధలింగేశ్వర, గాదిలింగేశ్వరస్వాముల జోడు రథోత్స వాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి తెలిపారు. శనివారం ఆమె గూళ్యం గ్రామంలో పర్యటించారు. తాగునీటి సమస్యపై ప్రజలతో మాట్లాడారు. గూళ్యంజాతరలో తాగునీటి సమస్య తలెత్తకుండా 25 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. బాపురం రిజర్వాయర్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. గూళ్యంలో వీధి కుళాయిలకు నిత్యం నీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు పైపులైన్ మరమ్మతులు చేయడం జరుగుతుందని తెలిపారు.

## తెలుగు భాషా సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి..

**: మాతృభాష దినోత్సవం సభలో వెంకటలక్ష్మి..**



**పల్లెపాడు/కోసిగి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తెలుగు భాషా, సాంప్రదాయా కళలను పరిరక్షించుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని తెలుగు ఉపాధ్యాయుని నెల్లూరు వెంకటలక్ష్మి అన్నారు..శనివారం కోసిగి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్స వపు సంబరాలు జరిగాయి.. పాఠశాల హెచ్ఎం. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి మాట్లాడారు. మన సాంప్రదాయ కళలను పరిరక్షించుకోకపోతే తెలుగు జాతి అంతరించి పోయే ప్రమాదం ఉందన్నారు.. సంస్కృత భాష తరువాత 56 అక్షరాలతో సుసంపన్నమైన తెలుగులోనే త్యాగరాజు వంటి ప్రముఖులు కీర్తనలు రాసి గానం చేసారన్నారు.. ముఖ్యంగా ఉపాధి కోసం ఆంగ్ల భాషను అభ్యసించినా తెలుగుభాషను విస్మరించరాదనా న్నరు.. అనంతరం జాతీయ పదాల వాడుకను అత్తా కోడళ్ల సంభాషణలతో నిర వ్వహించిన చిరునాటిక అందరిని ఆకట్టుకుంది.. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విద్యార్థులకు బహు మతులు అందజేసారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్, వెంకటేష్, నాగేంద్ర, ప్రసాద్, శాంతన్న, మునిస్వామి, వీరేష్, రజిత, వరలక్ష్మి, పాల్గొనా న్నరు..

## బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం



**ఆదోని విద్య, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఈనెల 14న రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం అత్యంత ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ రంగంకు బడ్జెట్లో కేవలం 4.31 శాతం నిధులు కేటాయించడం సూచనీయమని కనీసం బడ్జెట్లో 10 నిధులను కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాల్సి న రాష్ట్ర ప్రభుత్వం తక్కువ నిధులు కేటాయించి చేతులు దులుపుకుందని తద్వారా రైతు అనుబంధ రంగా లకు ఈ కేటాయింపుల ద్వారా ఒరిగేదేమీ లేదని జిల్లా కౌలు గారు సంఘం కార్యదర్శి తిమ్మయ్య అన్నారు ఈరోజు స్థానిక ఏ ఐ వైఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక కరువు కాటకాలతో కౌలుదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్న ప్రభుత్వం కౌలుదారులను ఆదుకోవడంలో విఫలమైందని ఆయన అన్నారు ఈనెల 23న ఎమ్మార్వో కార్యాలయాల ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలుదారుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం నాయకులు నాగేంద్రయ్యసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ సుదర్శన్ హాజరవుతారని తెలిపారు ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కసాపురం గోపాల్ పి.సత్యనారాయణ ఆదోని 2 కార్యదర్శి ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు బడ్జెట్లో రైతులకు తీవ్ర అన్యాయం : ఏపీ రైతు సంఘం.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై బిజెపి నాయకులు దాడి..



**పెద్దకడబూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నిరుద్యోగంపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అభివృద్ధి చేసి చూపించాలని ఇలాంటి ఆఫీసులపై దాడి చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ రాజు అన్నారు శనివారం అయన పెద్దకడబూరులో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హాయంలో ప్రజాస్వామ్యంలో దాడులు పెరిగిపోతున్నాయని నిరోద్యోగ సమస్యలపై దేశ ప్రయోజనాలపై దెబ్బతీసే విధంగా చేయడం సరైనది కాదని ప్రజలకు మేలు చేసే విధంగా అభివృద్ధి చేసి చూపించాలి తప్ప ఇలాంటి ఆఫీసుల పైన దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ పై దాదులు బిజెపి అహంకార ధోరణికి నిదర్శమని ఆయన మండిపడ్డారు ప్రశ్నించే గొంతులను దాడిలతో నొక్కలేరనే హెచ్చరించారు ప్రధానమంత్రి మోడీ వైఫల్యములను వాణిజ్యపరంగా దేశ సంపదను కార్పొరేట్లకు తాకట్టు పెడుతూ యువతకు ఉద్యోగాలకు కల్పించడం లేదని 13 సంవత్సరాల బిజెపి పాలనలో ప్రజలకు ఏమాత్రం అభివృద్ధి లేదని వారు విమర్శించారు ఇలాంటి కాంగ్రెస్ పార్టీ ఆఫీసుల పైన దాడులు చేసే బిజెపికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు నిరంతరం ప్రజాపక్షాన పోరాడుతున్నామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ తిక్కన్న.. మండల నాయకులు అంజనేయ ..సంసోను.. కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి అధికార మదంతో..



**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై బిజెపి యువమోర్చా కార్యకర్తలు దాడి చేయడం నీతిమాలిన చర్య అని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, నిన్న అందిన సమాచారం మేరకు, కాంగ్రెస్ పార్టీ ట్రైనింగ్ లో ఉన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు జిల్లా ఎస్పీ తో మరియు స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ తో మాట్లాడి పార్టీ కార్యాలయానికి రక్షణ కల్పించాలని కోరడం జరిగిందని, పోలీసులు రక్షణగా ఉన్న వారి సమక్షంలోనే బిజెపి యువమోర్చా కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై దాడి చేయడం, గేటును డ్యామేజ్ చేసి, ఫ్లెక్సీలు చింపివేయడం మా కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని కఠిన పదజాలంతో విమర్శించడం బిజెపి గుండాలకే తగునని విమర్శించారు. కర్నూలు జిల్లాలో ఎప్పుడు ఎరగని రీతిలో అధికార మదంతో మత తత్వ పార్టీ అయినా బిజెపి పార్టీ యువ మోర్చా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి పునుకున్నారు. దేశం, రాష్ట్రములో ఏ పార్టీవాళ్లు ఏమి చేసుకున్నరో తెలియదు కానీ కర్నూలు జిల్లాలో మాత్రం ఏ పార్టీ కూడా ఒక పార్టీ ఆఫీస్ పైకి మరో పార్టీ దాడి చేయలేదు. అది కర్నూలు సంస్కృతి అని, కర్నూలులో ఉండే రాజకీయ నాయకులందరు సామరస్యంతో ఒక్కరికి ఒక్కరు గౌరవించుకుంటూ ఉండేవాళం కానీ, ఈ మతతత్వ ప్రేరేపిత పార్టీ అయినా బిజెపి వాళ్లు సరికొత్త నాటకం ఆడారు. ఈరోజు ఇదే పునరావృతం అయితే భవిష్యత్ లో పార్టీ ఆఫీస్ లు పెట్టుకోలేరు. ఎందుకంటే మనము ఒక్కరికి, ఒక్కరం గౌరవించుకుంటూ పోతే దేశంలో, రాష్ట్రంలో సంఘటనలు జరుగుతుంటాయి. నిరసనలు జరుతుంటాయి. నిరసనలు తెలుపుతుంటాము. అది ప్రజాస్వామ్య రీతిలో, అప్రజాస్వామిక రీతిలో దాడులకు పునుకొనడం అధికార బలంతో, మంద బలంతో పార్టీ ఆఫీస్ పై దాడి చేయడం అనేది హేయమైన చర్య మేము విమర్శిస్తామని పాలకులు తప్పు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఆపోజిషన్ పార్టీగా మేము విమర్శిస్తాము. దానిని విమర్శ రూపంలో ఉండాలే తప్ప, ఈ రోజు విమర్శ రూపంలో కాకుండా దాడులకు పాల్పడారు. కాంగ్రెస్ ఆఫీస్ లో దాడులు చేశారు. గేట్లు విరగ్గొట్టారు. ఫ్లెక్సీలు చింపి వేశారు. ఇది మోదీ, అమిత్ షాల నాయకత్వ లక్షణాలు. హింసే వారి ధ్యేయమని, అధికారమే వారి ధ్యేయమని, హింస ద్వారానే అధికారం చేపట్టినదనీ, అందరికి తెలుసు. అని ఇంకోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా జిల్లా ఎస్పీ ఈ విషయంలో చొరవ తీసుకొని ఏవరైతే దాడి చేసినారో, అందరి దగ్గర సీసీ పుటేజులు ఉన్నాయి, వీడియో కెమెరాలు ఉన్నాయి. వాటి ద్వారా పరిశీలించి వారు ఎంతటి వారైనా సరే వెంటనే అరెస్టు చేయాలి. అరెస్టు చేసి తగిన శిక్ష పడితే ఇంకోసారి ఇటువంటి దాడులకు పాల్పడరు. కాబట్టి వారిని వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్య విలువలు కాపాడావలసిందిగా కోరుతున్నానని సుధాకర్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, మొదలగు వారు పాల్గొన్నారు.

## సర్పంచులకు సన్మానం



**దేవనకొండ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులకు మండల పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఎంపీడీఓ జ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ రాముడుయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మరో రెండు నెలల్లో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో మండల సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచుల సన్మాన కార్యక్రమంలో భాగంగా నెల్లిబండ సర్పంచ్ లలితమ్మను సన్మానించారు. సర్పంచులు చేసిన సేవలను వారు కొనియాడారు. వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానము..



**అవుకు రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదేశాల మేరకు 2026-27 విద్యాసంవత్సరానికి అవుకు ఏపీ మోడల్‌స్కూల్ నందు 6వ తరగతి ప్రవేశాలకు ఆహ్వానించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హేమిమా తెలిపారు. అర్హతలు ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల నుండి ఐదవ తరగతి తెలుగు ఇంగ్లీషు మీడియంలో చదువుతో ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి. వయసు ఓసి, బీసీ విద్యార్థులకు 01-09-2014 నుంచి 31-08-2016 సంవత్సరాలు మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2012 నుంచి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలి. అర్హతలు కలిగిన విద్యార్థులు 24-02-2026 నుంచి 31-03-2026 వరకు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు ఆన్‌లైన్ ఫీజు చెల్లించి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లయి చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్ష 12-04-2026 రాష్ట్రవ్యాప్తంగా అన్నిమోడల్ స్కూల్స్ నందు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఈప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లీషు మీడియంలో (సీబిఎస్ఈ)కి అనుగుణంగా నిర్వహించబడును, ఈపరీక్షలో ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు కనీస అర్హత మార్కులుగా నిర్వహించడం జరిగింది. ప్రవేశపరీక్షల్లో వచ్చిన మార్కులకు అనుగుణంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీటు కేటాయింపు జరగుతుందని ఈఅవకాశం అవుకు మండల పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమిమా, వైస్ ప్రిన్సిపాల్ మునిద్ర తెలిపారు.

## శనగ పంటకు మద్దతు ధర



**అవుకు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** శనగ పంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందని మండల వ్యవసాయ అధికారి కలిమున్నీసా శనివారం తెలిపారు. అవుకు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ అవుకు మండలంలో 1800 హెక్టార్లలో రైతులు సెనగ పంటను సాగు చేసినట్లు తెలిపారు. ఎకరాకు 6 నుంచి 10 క్వింటాల్ దాకా దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఒక క్వింటాకు 5వేలు ధర పలుకుతుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని ఒక క్వింటాకు రూ.5875/ లు మద్దతు ధర ప్రకటించినందని తెలిపారు. కావున రైతులు ఈ లబ్ధి పొందాలంటే ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పనికి రాని వస్తువులు ఇవ్వండి..

**– నిత్యావసరాలు తీసుకోండి– ఎంపిడిఓ**



**జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** గ్రామాలను పరిశుభ్రంగా వుంచేందుకు రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ స్వచ్ఛరథం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇందులో భాగంగా సిబ్బంది ఇంటింటికి వెళ్లి పనికిరానికి వస్తువులను సేకరిస్తారని ఎంపిడిఓ గోపిక కృష్ణ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా శనివార ం స్వచ్ఛ రథాన్ని ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పనికి రాని వస్తువులకు సమానమైన నగదు లెక్కించి సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తారన్నారు. స్వచ్ఛ రథంలో వెనుక భాగంలో నిత్యావసర సరుకులు, ముందు భాగంలో అట్టపుట్టెల నుంచి ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్,స్టీల్ సామాగ్రి, చిరిగిపోయిన బస్తాలు, గన్నీ బ్యాగులు, పేపర్లు వంటి పనికిరాని వస్తువులు (పొడిచెత్త) పెట్టుకునేలా వాహనాన్ని తయారు చేశారన్నారు. స్వచ్ఛ రథంతో గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. డిప్యూటీ ఎంపిడిఓ పద్మవతి, సూపరిన్‌డెంట్ మధు సుధనయ్య, మహిళా పోలీసు భువనేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**– వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి**



**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 18 నెలల కాలంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఎక్కడ చూసినా మహిళలపైన, చిన్నారులపైన అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం అరికట్టడంలో విఫలమైందని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి వాపోయారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హోంమంత్రి మహిళ అయినా జరుగుతున్న సంఘటనలు సీరియస్‌గా తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం ఉపన్యాసాలకు పరిమితమై నేరాలను అదుపు చేయలేకపోతున్నారన్నారు. దేవాలయాల్లో భక్తులపైన పోలీసులు లాఠీలు ఝులిపిస్తున్నా చర్యలు లనవ్వఆరు. రాష్ట్రంలో ఇటువంటి ఘర్షణలు జరిగిన కూటమి నాయకులపై ఎలాంఇ చర్యలు తీసుకోకపోవడం ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టించడం, వారిని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు.

## ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**– తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి చిన్నహ్యాట శేషగిరి**



**హొళగుంద, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి చిన్నహ్యాట శేషగిరి అన్నారు. ఈ సంద్భంగా మండలకేంద్రమైన హొళగుందలోని బస్టాండులో పంచాయతీ సర్పంచులు చలువాది రంగమ్మ అధ్యక్షతన గ్రామాభివృద్ధి అధికారి రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ ఎంపీడీఓ చక్రవర్తులతో కలిసి 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామలు, పట్టణాల స్వచ్ఛత కోసం ఎన్నో నిధులను వెచ్చిస్తోందని, అలాంటప్పుడు ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం తమవంతుగా కృషి చేయాలన్నారు. అలాగే స్వచ్ఛ రక్షక్ వాహనాన్ని వారు ప్రారంభిస్తూ ప్రజలు తమ ఇంటి వద్ద వచ్చే స్వచ్ఛత కార్మికులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించి కాలనీలలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సొసైటీ డైరెక్టర్ ప్రసాద్, టీడీపీ మైనార్టీ నాయకులు ఆదాం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది, సర్పంచ్ తనయుడు పంపాపతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

**– ఎంపీడీఓ వరలక్ష్మీ**



**హాలహర్వి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమవుతుందని ఎంపీడీఓ వరలక్ష్మీ అన్నారు. శనివారం మండలకేంద్రమైన హాలహర్వి స్వర్ణాంధ్ర, -స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. పరిశుభ్రతపై సర్పంచులు, ఎంపీటీసీలు, పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిఒక్కరూ జీరో వేస్ట్ జీవన శైలి అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛతపై అడుగులు వేయాలని ఆదేశించారు. అలాగే ఐవీఆర్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. హాలహర్విలో స్వచ్ఛ రథం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహ, రామకృష్ణ, ఓంప్రకాష్, ఏపీఓ చక్రవర్తి, ఎంఈఓ ఈరన్న, శ్రీనివాసరెడ్డి, ఆయా గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాగ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**– స్వచ్ఛరథాన్ని ప్రారంభించిన ప్రత్యేక అధికారి**



**పాములపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్య క్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి ఎంఎన్‌వి రాజు, ఎంపీడివో చంద్రశేఖరులు అన్నారు. శనివారం మండలానికి వచ్చిన నూతన స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్ాల్డుతూ ప్రతిగ్రామంలో స్వచ్ఛరథం తిరిగి శుభ్రతపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రజల వద్ద నుండి వారికి పనికిరాని వస్తువులను తీసుకొని స్వచ్ఛరథం వారికి కావాల్సిన వస్తువులు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడివో సులోచన, టీడీపీ నాయకులు శివశంకర్‌స్వామి, స్వచ్ఛరథం అర్గనైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నదులను కాపాడడం.. ప్రతిపౌరుని కర్తవ్యం

**– కెసి కెనాల్ స్వచ్ఛత పనులు కలెక్టర్ ఏ సిరి పరిశీలన**



**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పౌరుల బాధ్యతాయుత సహకారంతోనే నదుల సంరక్షణ ఫలప్రదమవుతుందని నదులను కాపాడడం ప్రతిపౌరుని కర్తవ్యమని జిల్లా కలెక్టర్ ఏ సిరి పేర్కొన్నారు. శనివారం వినాయక ఘాట్ సమీపంలోని కెసికెనాల్‌లో కొనసాగుతున్న శుభ్రత పనులు నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్‌తో కలిసి కలెక్లర్ పరిశీలించారు. కెనాల్ పరిసరాల్లో చెత్త పారవేయడాన్ని కట్టడి చేయడానికి మున్సిపల్ శానిటేషన్ జలవనరుల శాఖ సిబ్బంది ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని కలెక్టర్ అదేశించారు. దెబ్బతిన్న రక్షణ వలయాన్ని తక్షణమే పునరుద్ధరించాలని సూచించారు. కెనాల్‌లోకి మురుగునీరు ప్రవహిస్తున్న ప్రదేశాలను గుర్తించి వాటి మళ్లింపుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగర నడిబొడ్డున ప్రవహించే కెసికెనాల్ నగర సౌందర్యానికి ప్రతీకగా నిలవాలని అయితే పరిసర ప్రాంతాల నిర్లక్ష్యంతో అపరిశుభ్రత నెలకొనడం విచారకరం అన్నారు. కెనాల్ శుభ్రత సంరక్షణకు ప్రజాధనం వినియోగమవుతున్న విషయాన్ని గుర్తించుకోవాలని పేర్కొన్నారు. విజ్ఞతతో ఆలోచించి ప్రజలు చెత్తను మున్సిపల్ వాహనాలకే అప్పగించి సహకరించాలని కలెక్టర విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్యధికారి డా.నాగప్రసాద్ బాబు, డిఈఈ పవన్‌కుమార్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఆర్ రాజు, నాగేశ్వర్‌రావు, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

# అలివి వలలతో.. అక్రమ చేపల వేట

**-భారీగా చేప పిల్లలను పట్టి తరలింపు**
**-ప్రభుత్వ నిభందనలకు నీళ్ళు**
**- కన్నెత్తి చూడని మత్స్యశాఖ అధికారులపై అనుమానాలు**

**నందికొట్కూరు,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** నిభంధనలకు విరుద్దంగా నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామ సమీపంలోని కృష్ణానది బ్యాక్ వాటర్ వద్ద అలివి వలలతో చేప పిల్లలను పట్టి యథేచ్ఛగా తరలిస్తున్న పర్యవేక్షించాల్సిన మత్స్యశాఖ అధికారులు కన్నెతి చూడక పోవడంపై పలు అనుమాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షల్లో చేప పిల్లలు అభివృద్ధి చెందేందుకు నదిలో పాలకుల చేతుల మీదుగా వదులుతున్నారు. అలివి వలలను నిషేధించింది. అయిన చేపల వేటగాళ్ళ నదితీర ప్రాంతంలో విచ్చలవిడిగా నిషేదిత అలివి వలలతో చేప పిల్లలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తు లక్షల్లో డబ్బులు చేతులు మారుతన్నాయనే



విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలే నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మత్స్యశాఖ ఉన్నతాధికారులు దాదాపు 50 లక్షలు పైగా చేప పిల్లలను క్రిష్ణానది బ్యాక్ వాటర్‌లో వదిలారు. అవి అభివృద్ధి చెందకుండా పక్క రాష్ట్రాల సరిహద్దుల ప్రాంతంలో నెలనెల కూడ గడవక ముందే నిషేదిత అలివి వలలతో చేపలు పడుతున్న పర్యవేక్షించాల్సిన మత్స్య శాఖ అదికారులు అటువైపు కన్నెతి కూడ చూడడక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత మూడు రోజులుగా శాతనకోట సమీప ప్రాంతంలోని కృష్ణానది తీరంలో విచ్చలవిడిగా నిషేదిత అలివివలలతో చేప పిల్లలను పడుతు తరలిస్తున్నా సంభంధిం త అధికారుల పర్యవేక్షణ కొరవడడం విశేషం. **ఎఫ్.డి.వో.ను వివరణ కోరేందుకు ప్రశ్నించగా** నేను అందుబాటులో లేను వచ్చిన తరువాత చూస్తానని వివరణ ఇచ్చారు.



# మార్కెట్ యార్డ్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



**కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు శేషగిరి శెట్టి, పాలకవర్గ సభ్యులు మాధవస్వామి, కళ్యాణి, మారుతి శర్మ, సువార్తమ్మతో పాటు కార్యాలయ సిబ్బంది మరియు పొరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి, చెత్తను తొలగించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. స్వచ్ఛమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు.

# వైద్యరంగంలో.. నిరంతర పరిశోధన అత్యవసరం



**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** వైద్యశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు నిరంతరం జరుగుతుంటాయని, వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిశోధనలో ముందుండాల్సిన అవసరం ఉందని డా. పి. చంద్రశేఖర్, వైస్ ఛాన్సలర్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అన్నారు. శనివారం కర్నూల్ మెడికల్ కాలేజ్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎముకల వైద్య సదస్సు రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులు నిరంతర పరిశోధనతో పాటు తాజా వైద్య విధానాలను అవలంబిస్తేనే రోగులకు మరింత ఖచ్చితమైన, నాణ్యమైన చికిత్సలు అందించగలరని పేర్కొన్నారు. పరిశోధన కార్యకలాపాలకు విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రస్థాయి ఎముకల వైద్య సదస్సును కర్నూల్ మెడికల్ కాలేజ్ నిర్వహించడం అభినందనీయమని, ఈ రంగంలో జరుగుతున్న నూతన పరిణామాలు వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. రెండో రోజు సదస్సుకు సుమారు వెయ్యి రెండు వందల మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. వైద్య విద్యా వ్యవస్థలో పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, రోగుల భద్రత అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. శిక్షణతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవడం వైద్యుల బాధ్యత అని అన్నారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా మరియు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రమాద చికిత్స, వెన్నెముక శస్త్రచికిత్స, కీళ్ల మార్పిడి, క్రీడా గాయాలు, పిల్లల ఎముకల వైద్యం వంటి అంశాలపై చర్చలు, పరిశోధనా నివేదికల ప్రదర్శనలు, ఆధునిక చికిత్సా విధానాలపై వివరించారు. కార్యక్రమంలో వైద్య విద్యాధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, ఆసుపత్రి అధికారి, సదస్సు నిర్వాహకులు, శాస్త్రీయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధికి కృషి చేయండి.

**ఎమ్మెల్సీ బిటి నాయుడు.**



**ఆదోని ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** మున్సిపల్ కమిషనర్ నహీమ్ అహ్మద్ ఆదోని పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీ బిటి నాయుడు అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రీవిలేజ్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్సీ బీటీ నాయుడు ని మున్సిపల్ కమిషనర్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ బీటి నాయుడు స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం కృషి చేయాలని అధికారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మునిసిపల్ కమిషన్ అడిగి తెలుసుకున్నారు

# రైల్వే ట్రాక్‌పై.. విద్యార్థి మృతి..!

**ఆత్మహత్యనా? లేక హత్యనా?**



**నంద్యాల, ఫిబ్రవరి 21,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల పట్టణంలో పోన్నాపురము కాలనీ వద్ద ఇంజనీరింగు విద్యార్థి అనుమానస్పదముగా మృతి చెందాడు. వివరాలోకి వెల్లితే నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన విజయకుమారు అనే విద్యార్థి శనివారము ఉదయం నంద్యాల వద్ద పోన్నాపురము కాలనీ వద్దరైల్వే ట్రాక్‌పై శవమై కనిపించాడు,రైల్వే పోలీసులు వివరాలు అరా తీయగా అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డును చూసి కర్నూలు కెవిసుబ్బారెడ్డి కాలేజిలో బిటెక్ మూడవ సంవత్సరము చదువుతున్నట్లు అదారము దొరికాయి. దీనితో అతనిని బందువులకు కబురు పంపగా వారు వచ్చి తన కుమారుడిది అత్మహత్య కాదని ఎవరో హత్య చేసి ఇక్కడ పడ వేశారని అరోపించారు.విజయకుమార్ మృతి అనుమానస్పదముగామారింది. అత్మహత్యనాలేక హత్య అనేది పోలీసులు దర్యాప్తులో తేలాలి

# అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లను ,హారన్ లను రోడ్ రోలర్‌తో ధ్వంసం..!

**: 100 బైక్ సైలెన్సర్సులు,500 ఆటో హారన్‌లు ధ్వంసం..: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**



**కర్నూలు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి :** శనివారం కర్నూలు పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయం కొండారెడ్డి బురుజు దగ్గర అధిక శబ్దం కలిగించే 100 సైలెన్సర్స్ లను, 500 ఆటో హారన్ లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియా తో మాట్లాడారు. కర్నూలు నగరంలో కొంతమంది యువకులు వారి యొక్క ద్విచక్ర వాహనాలకు అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్స్ ను మాడిఫైడ్ చేసి అమర్చుకుని, అధిక శబ్దం వచ్చే విధంగా డ్రైవ్ చేయడం తో వారి పై ఒక నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. 100 బైక్ సైలెన్సర్స్‌లను,500 ఆటోల హారన్ లను సీజ్ చేయడం జరిగిందన్నారు .రోడ్ రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. రాత్రి వేళల్లో అధిక శబ్దం వచ్చే విధంగా సౌండ్ పోల్యూషన్ చేస్తున్నారని ప్రజల నుండి ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. అటువంటి బైక్ లు, ఆటోల పై కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు, కర్నూలు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలకు , యువతకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన చేస్తున్నామన్నారు. మోటార్ వెహికల్స్ చట్టం ప్రకారం అనుమతి లేని మార్పులు చేసిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి వాహనదారుడు వ్యక్తిగత భద్రత పాటించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. డిజిటల్ ఎల్ ఈ డి డిస్ ప్లే బోర్డు ను , 66 సోలార్ రెడ్ బ్లింకింగ్ స్టడ్స్ ను, 4 అధునాతన మూవబుల్ బారికేడ్స్ ను కర్నూలు ట్రాఫిక్ పోలీసులకు దాతలు అందజేశారన్నారు. అనంతరం దాతలైన కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం , గోల్డ్ షాప్ ప్రభాకర్ , డి ఈ ఫణీ కుమార్ లకు కర్నూలు ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు.ముఖ్యమైన రద్దీ ప్రాంతాలలో రాత్రి వేళల్లో రోడ్డు బాగా కనిపించే విధంగా సోలార్ రెడ్ బ్లింకింగ్ స్టడ్స్ ను త్వరలో ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ , ఆర్ ఐ లు, ఆర్ఎస్ఐలు, కర్నూలు ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

# గజ్జహాళ్లిలో ఘనంగా ఆంజనేయస్వామి పున: విగ్రహ ప్రతిష్టాపన

**హొళగుంద, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త;** మండలంలోని గజ్జహాళ్లి గ్రామంలో దాతలు గజ్జహాళ్లి హనుమంతరెడ్డి, భక్తుల సాయంతో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి శిలా ఆలయంలో శుక్రవారం గజ్జహాళ్లి తిమ్మారెడ్డి, గజ్జహాళ్లి శ్రీనివాసరెడ్డి, గజ్జహాళ్లి హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి పున: విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. ఆలయ నూతన గోపురానికి నూతన కలశ ప్రతిష్టాపన, ఆలయ ఆవరణలో నూతన శిలా స్థభం ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుడు జె.కె.నరసింహాచార్, పురోహితులచే



ఉదయం 9 గంటలకు దేవతలకు కుంభాభిషేకం, ఆంజనేయస్వామి పున: విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఈ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు వేద పండితుడు జె.కె.నరసింహ ఆచార్ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆంజనేయస్వామి నూతన విగ్రహ పున: ప్రతిష్టతో పాటు నూతలన కలస, నూతన ధ్వజస్తంభ కార్యక్రమం, భీరప్ప డోలు, హరే శ్రీనివాస భజన సంఘంచే రామకీర్తనలు, శ్రీరా భజనలు, కోలాటాలు చేపట్టారు. భారీ క్రేన్‌తో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

# మీ ఇంటి లాగే మీ వీదులను పరిశుభ్రంగా ఉంచుకోండి



**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** మన ఇంటిని ఏవిదముగా అందరము కలిసి శుబ్రంగా ఉంచుకుంటామో మన గ్రామాన్ని మన వీదులను అలాగే పరిశుబ్రంగా ఉంచుకుని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి పిలుపు నిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్చఆంధ్రా, స్వర్ణాంధ్రా కార్యక్రమము మూడవ శనివారము నిర్వహించారు. అందులో బాగంగా రాష్ట్ర రోడ్డు భవనాలు, పెట్టుబడులు,మౌళిక వసతుల శాఖ మంత్రి బిసి.జనార్ధనరెడ్డి కోవెలకుంట్ల ఈఓ ప్రకాశ్‌నాయుడు అద్వర్యంలో నిర్వహించిన స్వచ్చఆంధ్రా, స్వర్ణాంధ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్బముగా అస్టిరి బస్టాండు నుండి స్థానిక గ్రామపంచాయితీ వరకు చిన్నారులు నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అక్కడ స్వచ్చఆంధ్రా, స్వర్ణాంధ్రా నినాదాలతో ర్యాలీ సాగింది.అనంతరము నాల్గురోడ్ల కూడలి వద్ద మానవహారము నిర్వహించారు. ఇందులో మంత్రి పాల్గొని చిన్నారులు, అదికారులతో పాటు ప్రతిజ్ఞ చేశారు. అనంతరము మంత్రి మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రి హోదా ఉన్న నారాచంద్రబాబునాయుడు నిత్యము రాష్ట్రాబివృద్ధి కోసం తపిస్తున్నారని చెప్పారు. ఎక్కడైతే వీదలు శుబ్రంగాఉంటాయో అ వీదిలో దోమలు వ్యాదులు ప్రబలుకుండా ఉంటాయని చెప్పారు. వ్యాదులకు మూల కారణము అపరిశుబ్రతేకారణమని చెప్పారు.అందుకే మనందరి కర్తవ్యము మన గ్రామాని మన వీదులను శుబ్రంగా ఉంచుకోవడము. ఈకార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు యస్ఎ గపూరు, పొట్టిపాడు సుబ్బారెడ్డి కాంట్రిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బివిప్రసాదరెడ్డి , కరిమద్దెల మురళీ, పెనుగొ్డ రాజశేఖరు, డాక్టరు శ్రీదరరెడ్డి, చిన్నవెంకటసుబ్బారెడ్డి గడ్డంసోదరులు, నాగేశ్వరరెడ్డి అమరనాదరెడ్డి రామ కృష్ణారెడ్డి గాధంశెట్టిరమణయ్య, బిజెపినా యకులు, జనసేన నాయకులు,అర్‌డబ్ల్యుయస్ డిఈఈ మదు సూదన్, ఎఈ సాయి,విద్యుత్ ఎడిఎ సతీష్ కుమారరెడ్డి, ఎఈ రాంమోహన్,యంపిడిఓ వరప్రసాదు, తహశీలుదారు పవన్‌కుమారరెడ్డి, ఎపిఒ శ్రీకళ, వెలుగు ఎపియం చంద్రశేఖరు,యంఈఓ వెంకటసుబ్బయ్యసిఐ హనుమంతునాయక్, యస్ఐలు మల్లికార్జునరెడ్డి రమణయ్య, బుచ్చన్న, వెంకట సుబ్బారెడ్డి ధనుంజయ్‌యాదవ్, గజ్జలవుశేనయ్య, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రాంతంలో నలుగురు గజదొంగలు అరెస్ట్

**ఆత్మకూరు, ఫిబ్రవరి21 ప్రభాతవార్త** ఆత్మకూరు ప్రాంతంలో గజ దొంగలకు ఆత్మకూరు పోలీసులు దడలు పుట్టిస్తున్నారు వాహనాల బ్యాటరీలు సీసీ కెమెరాల డివిడి, కాపర్ వైర్లు, ఇనుప కడ్డీల మొక్కలు వీటితోపాటు ఆటోను సీజ్ చేసి నలుగురు గజదొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది పట్టణంలో పలు దొంగతనాల కేసుల్లో నలుగురిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేయగా వారి వద్ద నుంచి .క్రైమ్ నెంబర్.17/2026 కింద బిఎన్ఎస్ 303(2) సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ ఓ.మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ముద్దాయిలు చెంచు గణేష్ (24), పసుపుల సంజమ్మ (22), మాండ్ల నరసమ్మ (20) మరియు ఒక మైనర్ బాలుడు దొంగతనాలకు పాల్పడినట్లు వారు



అంగీకరించడం జరిగిందని తెలిపారు. వీరంతా ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వారిని సీఐ వెల్లడించారు.సీఐ తెలిపిన వివరాల మేరకు వీరు ప్లాస్టిక్ కవర్లు కాగితాలు ఖాళీ బీరు సీసాలు సేకరించి గుజారీ దుకాణాల్లో అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవారని సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో పార్కింగ్ చేసిన లారీలు ఇతర వాహనాల నుంచి బ్యాటరీలు మరియు మోటార్ వైండింగ్ షాపుల వద్ద మోటర్లకు చెందిన కాపర్ కేబుల్ వైర్లు ఇనుప వస్తువులు దొంగతనం చేసి ఆటోలో తరలించి అమ్ముతున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు.దొంగిలించిన వస్తువులను ఆటోలో తీసుకుని మార్కాపురం వైపు వెళుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఓ.మహేశ్వర్ రెడ్డి మరియు ఎస్సై డి.వి. నారాయణరెడ్డి సిబ్బందితో కలిసి శ్రీశైలం రోడ్ లోని ఎన్ హెచ్ 340ది ఫ్లైఓవర్ సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని వారి వద్ద నుండి ఒక ఆటో 8 అమరాన్ బ్యాటరీలు ఒక సీసీటీవీ డీవీఆర్ 06 లారీ ఇనుప కట్టలు కాపర్ కేబుల్ వైర్లు మరియు ఇనుప కడ్డీలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నలుగురు ముద్దాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

**– అహోబిలంలో కార్డెన్ అండ్ సెర్చ్ అపరేషన్**

**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పవిత్ర పుణ్యక్షేత్రమైన అహోబిలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. శనివారం తెల్లవారుజామున అహోబిలంలో ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లోని 50 మంది అధికారులు, సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ అపరేషన్ నిర్వహించారు. ఈఅపరేషన్‌లో 8 మంది వ్యక్తుల నుండి 284 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యప్రదేశాల్లో వాహనాలు తనిఖీలు నిర్వహించి రౌడీషిటర్‌లు, నేరచరిత్రగల వారు అనుమానిత ఇళ్ళల్లో తనిఖీలు చేశారు. ఈసందర్బంగా ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ మాట్లడుతూ అహోబిలంలో అక్రమ మద్యం విక్రయాలు నాటుసారా అమ్మకాలు, రౌడీయిజం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సహించబోమన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల ్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో ఆళ్లగడ్డ రూరల్ సిఐ బివి రమణ, ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ వరప్రసాద్, ఉయ్యాలవాడ ఎస్ఐ రామిరెడ్డి చాగలమర్రి ఎస్ఐ రాజారెడ్డి, ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ పీరయ్య, రుద్రవరం ఎస్ఐ జయప్ప,



# త్వరలో ఆత్మకూరు స్క్వాడ్ రేంజ్ అధికారిగా బాధ్యతలు

**: బషీర్ అహ్మద్ డిప్యూటీ రేంజ్ అధికారిగా శిఖరం దగ్గర ప్రస్తుత విధులు**
**: ప్రమోషన్ మీదుగా ఆదేశాలు జారీ చేసిన అటవీ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు**



**ఆత్మకూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్ పరిధిలో శ్రీశైలం రేంజ్ లో డిప్యూటీ రేంజ్ అధికారిగా అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న బషీర్ అహ్మద్ కు రేంజ్ అధికారిగా త్వరలో బాధ్యతలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయమైన సమాచారం అటవీ శాఖలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా పర్యావరణం, వన్యప్రాణి, సంరక్షణ అడవి సంపద కాపాడుతూ విధి నిర్వహణలో ముందుకు వెళ్తున్న నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు రేంజ్ అధికారిగా ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం త్వరలోనే ఈ అధికారి గతంలో డిఆర్ఓ గా, నంద్యాల జిల్లాలోని డోన్, కడప జిల్లాలోని రాజంపేట లో పనిచేసి ప్రస్తుతం శ్రీశైలం శిఖరం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు ఆత్మకూరు పట్టణంలో 15 సంవత్సరాలుగా ఏపీ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ లో అధ్యక్షుడిగా, సెక్రెటరీగా ఎన్నో విధాలుగా సేవలు అందిస్తూ అటవీశాఖ ఉద్యోగుల సమస్యలపై కీలకంగా పనిచేశారు అన్ని విధాలుగా అనుభవం ఉన్న డిప్యూటీ రేంజ్ అధికారి బషీర్ అహ్మద్ కు చివరి దశలో రిటైర్డ్ మెంటుకు అనుగుణంగా ఉంటుందని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆత్మకూరు స్క్వాడ్ రేంజ్ అధికారిగా బాధ్యతలు చేపడుతున్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి

# వైసిపి బలపడుతోంది ఆదోని టిడిపి అధ్యక్షుడు తిమ్మప్ప..



**ఆదోని క్రైమ్ ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మకు ఆదోని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశాడు మా కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు ఎందుకంటే ఆదోని కూటమి ఎమ్మెల్యే బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి 18 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాము , బిజెపి నాయకులు కార్యకర్తలు నిండుగా ఉన్నారు, టిడిపి పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంది ఏదైనా సమస్యలు తీసుకెళ్తే పట్టణ అధ్యక్షుడికి కానీ మండల అధ్యక్షుడు కానీ అక్కడ గౌరవం లేదు పార్థసారథి స్థానికుడు కాదు టిడిపి కార్యకర్తలు ఐదు ఆరు గ్రూపులు ఉన్నాయి ఏకం చేయాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మది, లేకపోతే వైసిపి పట్టణంలో బలపడుతోంది కూటమి బలహీన పడుతుంది అనీ వ్యక్తం చేశారు.

# కర్నూలులో అడ్వకేట్‌పై దాడి?

**కర్నూలు అర్బన్ ఫిబ్రవరి 21 ,ప్రభాతవార్త:** కర్నూల్ బార్ అసోసియేషన్ లో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ ఎం. పవన్ కుమార్ పై దాడి జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గంజాయి కేసులో అరెస్ట్ అయిన తన క్లయింట్ జానకిరామ్ విషయంలో మాట్లాడేందుకు ఆయన కర్నూల్ 4వ పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. సిఐ విక్రమ్ సింహ తనతో దురుసుగా ప్రవర్తించినట్లు అడ్వకేట్ ఆరోపించారు. ఒక న్యాయవాదిపై జరిగిన ఈ ఘటన న్యాయవాదుల వర్గంలో ఆందోళనకు దారితీసింది. సంఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# విద్యార్థిపై దారుణం..

**: తోటి విద్యార్థులే లైంగిక దాడి చేసినట్టు ఆరోపణలు..**




**ఆలూరు ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఆలూరు మండలం పరిధిలోని అరికేరి గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులే దారుణానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. అర్ధరాత్రి సమయంలో హాస్టల్ గదిలో ముగ్గురు విద్యార్థులు కలిసి బాధితుడిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఘటన సమయంలో బాలుడు సహాయం కోసం కేకలు వేసినా హాస్టల్ సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఉదయం తీవ్ర ఆందోళనలో ఉన్న బాధితుడు తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలియజేశాడు. వెంటనే పాఠశాలకు చేరుకున్న కుటుంబ సభ్యులు బాలుడిని అక్కడి నుంచి తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నాడు. పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరగా, ఈ విషయంపై నాకు సమాచారం లేదు అంటూ స్పందించినట్లు తెలుస్తోంది. అయితే ఘటనను పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టంగా చెప్పకుండా తప్పించుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని, అలాగే ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోని బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.